క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



ఆర్మూర్‌టౌన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రాజు అన్నారు. ఆర్మూర్‌లోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ కింద టోబాకో ఫ్రీ స్కూల్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజు మాట్లాడారు. అనంతరం పాఠశాల విద్యార్థులు చౌరస్తా వద్ద మత్తు పదార్థాలతో జరిగే నష్టాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



బాల్కొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సత్తా చాటాలని ఆపార్టీ బాల్కొండ నియోజక వర్గ ఇన్‌చార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. మంగళవారం ముప్కాల్ మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగుర వే యాలన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ , జిల్లా నాయకులు ముస్కు భూమేశ్వర్, ముస్కు నర్సయ్య, మండల అధ్యక్షుడు గడ్డం సంతోష్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి



ఆర్మూర్: అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచుతామన్నా హామీని మర్చిపోయిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సూర్యవంశీ సుజాత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని శాస్త్రీనగర్ మాదిగల సంఘంలో మంగళవారం వీహెచ్‌పీఎస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 5న ఆర్మూర్‌లో దివ్యాంగుల, చేయూత పెన్షన్‌దారుల సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు స్వామి, ప్రమోద్, మైలారాం బాలు, రాజేష్, ప్రదీప్, రాము, శ్రీదీప్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పొలం బాట



బాల్కొండ: ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం రైతు పొలం బాట నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే రైతులు లైన్‌మన్‌కు సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో సబ్‌ఇంజినీర్ కాంతారావు, లైన్ ఇన్‌స్పెక్టర్ నగేష్, లైన్‌మన్‌లు వినోద్, పీర్యా నాయక్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

బోధన్/మాక్లూర్ : వర్షాకాలంలో జీవాలకు వైరస్‌లతో సోకే నీలి నాలుక వ్యాధి ప్రమాదకరమైందని ఎడపల్లి పశువైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు.పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఎడపల్లిలో గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించారు. మాక్లూర్ మండలంలోని ఒడ్డెట్‌పల్లిలో మండల పశువైద్యులు ఉమా సహేర్, కిరణ్‌దేశ్‌పాండే ఆధ్వర్యంలో సిబ్బంది గొర్రెలకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆగస్టు 8 వరకు ప్రతి గ్రామంలో నీలి నాలుక వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని,పెంపకందార్లు వినియోగించుకోవాలని వైద్యులు తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సేకరించి బాధితులకు అందించామని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు. అబ్దుల్ నవీద్, అరవింద్, రాజు, యోగేశ్వరచారీలకు ఫోన్లు అందజేశామని ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

రుద్రూర్ : పోతంగల్ మండలం కొల్లూర్ గ్రామానికి చెందిన నిమ్మల లక్ష్మి ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకుని కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి, పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలికి ఫోన్‌ను ఎస్సై సునీల్ అందజేశారు.

చినుకు పడితే చిత్తడే

- బురదమయంగా కోనాపూర్ రోడ్డు
- వాహన రాకపోకలకు ఆటంకం
- ఇబ్బందులు పడుతున్న రెండు జిల్లాల ప్రజలు



వర్షానికి బురదమయమైన కోనాపూర్ రహదారి

కమ్మర్‌పల్లి: మండలంలోని కోనాపూర్ గ్రామం నిజామాబాద్, జగిత్యాల జిల్లాల రాకపోకలకు వారధిగా ఉంది. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఈగ్రామ రహదారి బురదమయం కావడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాళ్లవాగు వంతెన సమీపంలో 200 మీటర్ల మేర, భూషణ్‌రావుపేట వెళ్లే దారిలో శివాలయం సమీపంలో 300 మీటర్ల వరకు, తాళ్ల మండ వద్ద అర కిలోమీటర్ దూరం వరకు రోడ్డు పూర్తిగా బురదయమైంది. దీంతో అడుగులోతు బురదలో వాహనాలు దిగబడిపోతున్నాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటేనే ప్రయాణికులు జంకుతున్నారు. పాదచారుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గ్రామస్తులు ఏ అవసరం ఉన్నా కోరుట్ల పట్టణానికే వెళ్తుంటారు. అలాగే కోరుట్ల నుంచి ప్రజలు కోనాపూర్ రోడ్డు గుండా నిజామాబాద్ జిల్లాకు వస్తారు. ఈ రహదారి గుండా కోరుట్ల నుంచి భీమ్‌గల్ వరకు వందల సంఖ్యలో వాహనాలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటాయి. డిచ్‌పల్లి, ధర్పల్లి, జక్రాన్‌పల్లి, సిరికొండ మండలాల ప్రజలు భీమ్‌గల్, కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్, కోనాపూర్ మీదుగా వెళ్లి కథలాపూర్ చేరుకుంటారు. అక్కడి నుంచి వేములవాడ, అటునుంచి కొండగట్టు తదితర పుణ్యక్షేత్రాలకు వెళ్తుంటారు. కోనాపూర్ రోడ్డు చిలుజల్లులకే పూర్తిగా బురదమయం అవుతుండడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారి బాగుకోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి



మారుమూల గ్రామం కోనాపూర్‌పై అధికారులు, పాలకుల నిర్లక్ష్యం తగదు. చిన్నపాటి వర్షానికే రోడ్డు బురదగా మారుతోంది. రోడ్డు గుండా వెళ్లడం కష్టం అవుతోంది. వేరే రహదారి లేదు. బురదలో వాహనాలు దిగబడుతున్నాయి. వాహనాల రాకపోకలతో పాటు పాదాచారులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలి. – లకావత్ భాస్కర్, కోనాపూర్

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

బాల్కొండ/ మాక్లూర్/ : ఆయిల్ పామ్ సాగుతో రైతులకు అనేక లాభాలు ఉన్నాయని బాల్కొండ డివిజన్ ఉద్యానశాఖ అధికారి రుద్ర వినాయక్ అన్నారు. మంగళవారం ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు. మాక్లూర్ మండలం బోర్గాం(కే) గ్రామంలో ఆర్మూర్ ఏడీఏ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాన్ని ఇచ్చే ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. అమ్రాద్ గ్రామంలో గంగా మోహన్ అనే రైతు సాగు చేసిన ఆర్‌డీ ఆర్ 1200 రకం వరి పంటను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏవో పద్మ, ఏఈవో నరేశ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రెంజర్ల రైతు వేదికలో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి రుద్ర వినాయక్

పంటల పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో సాగు చేస్తున్న మొక్కజొన్న, వరి పంటలను ఏవో హరికృష్ణ పరిశీలించారు. సొసైటీ చైర్మన్ పెంట భోజా రెడ్డి, ఏఈవోలు రోచన, అనూష, రైతులు గంగాధర్ తదితరులున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కమ్మర్‌పల్లి: మండలంలోని హసాకొత్తూర్ గ్రామానికి చెందిన ఇరగదిండ్ల శేఖర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విషయం తెలిసిందే. శేఖర్ కుటుంబాన్ని మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి , స్థానిక బీజేపీ నాయకులు పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందించారు. పార్టీ మండలాధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి, నాయకులు సతీష్, దామోదర్, స్త్రుఖర్, నవీన్, బంగ్లా రమేష్, నరేష్, మహిపాల్, దేవదాస్, రాజేశ్వర్ తతదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలోకి తీసుకోవొద్దు

రుద్రూర్ : రుద్రూర్‌లో మంగళవారం ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులు తనిఖీలు నిర్వహించారు. హోటల్ లో బడీ డు బాలుడు పనిచేస్తున్నట్లు గుర్తించిన అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్ ముస్కాన్ ఎస్సై పీటర్, కానిస్టేబుల్ లు సతీష్ కుమార్, గంగాధర్, తదితరులున్నారు.

హాస్టళ్ల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో ఉన్న ఎస్సీ, బీసీ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులపై వార్డెన్లు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేల్పూర్‌లోని ఆయన నివాసంలో బాల్కొండ నియోజకవర్గంలోని ఎస్సీ, బీసీ హాస్టళ్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో ఉంటున్న ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండాలని, అందుకు తగినట్లుగా నాణ్యమైన భోజనం అందించాలన్నారు. హాస్టళ్లలో పారిశుధ్యం బాగుండాలని, విద్యార్థుల ఆరోగ్యంపై పారిశుధ్యం ఎటువంటి ప్రభావం చూపరాదని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి హాస్టల్ సూపరింటెండెంట్లు వారానికోసారి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా షెడ్యూల్డు కులాల అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజగంగారాం, ఏబిసీడీవో గంగాధర్, హాస్టళ్ల వార్డెన్‌లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



హాస్టళ్లపై సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

ఎల్‌వోసీలు అందజేత

భీమ్‌గల్ మండలం బాబాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ పీర్ అహ్మద్, కారెపల్లి గ్రామానికి చెందిన బాదవత్ షీలా, రూ. 2 లక్షల చొప్పున, దూదిగాంకు చెందిన రాజ్ బి, కుటుంబాలకు రూ. 1,20,000 ఎల్‌వోసీలను ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో అందజేశారు. వీరు వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరారు.

రాజారెడ్డి సేవలు చిరస్మరణీయం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ రెడ్డి సంఘం, లాలన వృద్ధాశ్రమం వ్యవస్థాపకుడు గడ్డం పైపుల రాజారెడ్డి సేవలు చిరస్మరణీయమని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కొనియాడారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి రెడ్డి సంఘ భవన ఆవరణలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజారెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యే హాజరై ఆవిష్కరించారు. విజయ్ విద్యా సంస్థల అధినేత్రి డాక్టర్ అమృతలత, ప్రముఖులు లోక భూపతి రెడ్డి, ఎన్వీ హన్మంత్ రెడ్డి, జీవీ నర్సింహా రెడ్డి, గడ్డం మారుతి రెడ్డి, కాంతి గంగా రెడ్డి, రాజా రెడ్డి కుటుంబ సభ్యులు సరిత రాజేశ్వర్ రెడ్డి, సునీత చంద్రశేఖర్ రెడ్డి, హేమంత్ రెడ్డి, మధుమతి, చిన్నవ్వ, విజయ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌లో బౌద్ధుల నిరసన

బోధన్: బీహార్‌లోని బోధ్ గయా ఆలయ చట్టం 1949 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం బౌద్ధ భిక్షువుల ఆధ్వర్యంలో బుద్ధిస్టులు, ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యులు పట్టణంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బౌద్ధ భిక్షువు భంతే బుద్ధా ఘోష్ మాట్లాడారు. బోధ్ గయాలోని బుద్ధ విహారం(ఆలయం) నిర్వహణ, పర్యవేక్షణలో ఈచట్టం ప్రకారం బౌద్ధులకు పూర్తి హక్కు లేకుండా పోతుందన్నారు. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధ మని తెలిపారు. బౌద్ధ భిక్షువు భంతే నాగవజ్ర, టీబీఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ భాగ్యవాన్,సమతా సైనిక్ దళ్ జిల్లా సంఘటకులు కపిల్ కాలేవార్, ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దేవిదాస్ కాంబ్లే, కార్యదర్శి దయానంద్ సాలూంకే, ఎస్సీ,ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ డివిజన్ కన్వీనర్ నీరడి ఈశ్వర్, కో-కన్వీనర్లు నీరడి రవికుమార్, సింగాడే పాండు, ప్రతినిధులు కొండ్ర వెంకటి,వాగ్మారే సూర్యకాంత్,వివిధ మండలాల అధ్యక్షులు దాసరి శ్యాం, రాహుల్, ఇందూర్ సాయిలు, కపిల్, అలోక్, సాగర్,చరణ్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్‌లో అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న బౌద్ధులు, తదితరులు

సాగుభూములను సబ్ డివిజన్ చేసి ఇవ్వాలి

బోధన్: పోతంగల్ మండల కేంద్రం శివారులోని సాగు భూములకు సబ్ డివిజన్ చేసి ఇవ్వాలని కోరుతూ మంగళవారం బోధన్‌లో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు తెలంగాణ రైతు సంఘం,వివిధ ప్రజాసంఘాల జిల్లా ప్రతినిధులు వినతిపత్రం అందించారు. 1991లో ప్రభుత్వం పోతంగల్ మండల కేంద్రం శివారులో 632,634 సర్వేనంబర్లలో సుమారు 40 మందికి పైగా దళిత, గిరిజన వర్గాల పేదలకు ఎకరం చొప్పున సాగు భూమి కేటాయించి పట్టాలు ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ భూములను సాగు చేసుకుని పేదలు జీవనం సాగిస్తున్నారని వివరించారు. కొందరు ధనిక రైతులు పేదలభూముల్లోకి వచ్చి దున్నుకుంటున్నారని, వారిని ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు తెగబడుతున్నారని తెలిపారు. పేదల సాగుభూములకు రక్షణ కల్పించాలని, వెంటనే సబ్‌డివిజన్ చేసి ఇవ్వాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేశ్,సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి యేశాల గంగాధర్,భూ లబ్ధిదారులు శకుంతల, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు సమస్యను వివరిస్తున్న రైతు సంఘం ప్రతినిధులు

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి పూజలు



ఆర్మూర్‌లో కుక్కల గుట్ట వద్ద పుట్టలో పాలు పోస్తున్న మహిళలు



ఆలూర్ మండల కేంద్రంలో..



బోధన్‌లోని సంతాన నాగమ్మ ఆలయంలో..

సాక్షి, నెట్‌వర్క్ : ఆర్మూర్, బాల్కొండ, బోధన్, బాన్సువాడ నియోజకవర్గాల్లోని ప్రజలు మంగళవారం నాగులపంచమి పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఆలయాల వద్ద గల పుట్టకు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మహిళలు అన్నదమ్ముళ్ల కళ్లు కడిగి పుట్ట ప్యాలాలు తినిపించారు. కోటగిరి, రుద్రూర్, పోతంగల్, వర్ని, చందూర్, మోస్రా మండలాల్లో బీజేపీ, హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఉచిత ఆవు పాలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. కోటగిరి నాగమ్మ ఆలయం వద్ద స్తంభం ఏర్పాటు చేసి భక్తులు కాషాయ జెండాను ఎగురవేశారు. ఆలయాల వద్ద అన్నదానం చేపట్టారు.



నవీపేటలో ...



బాల్కొండలో సలిగంటయ్య వద్ద..



ముప్కాల్ మండలం నాగంపేట్‌లో..



సాటాపూర్ గ్రామంలో..



పోచంపాడ్‌లో పుట్టకు ..



పోచారం గ్రామ శివారులో ..



నందిపేటలో ..



కోటగిరి నాగమ్మ ఆలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న భక్తులు



రుద్రూర్‌లో ఆవుపాలు పంపిణీ చేస్తున్న బజరంగ్ దళ్, వీహెచ్‌పీ సభ్యులు



తగిలేపల్లిలో పాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

గుంత చింత..



కాకతీయ కాలువ వంతెన రోడ్డుపై ఏర్పడిన గుంత

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన కాకతీయ కాలువ వంతెనపై పైపులైన్ లీకేజీతో వంతెన ముందట రోడ్డు కోతకు గురై గుంతలు ఏర్పడ్డాయి. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో ప్రాజెక్ట్ సందర్శనకు వస్తున్న పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ : పట్టణంలోని 10, 31 వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై జాగ్రత్త వహించాలని సూచించారు. పట్టణంలోని శాస్త్రినగర్‌లో అర్బన్‌హెల్త్‌సెంటర్, మున్సిపాల్ ఆధ్వర్యంలో ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖ అధికారులు పలు చోట్ల నీటి నిల్వలను తొలగించి, దోమల ద్వారా వచ్చే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. మెండోరా మండల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణ కోసం మండల ప్రత్యేకాధికారి అంజనేయులు ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. పోచంపాడ్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం నుంచి గంబూషియా చేప పిల్లలను తీసుకు వచ్చి , వర్షం నీరు నిల్వ ఉన్నా చోట వదిలారు. ఇన్‌చార్జి శానిటరి ఎస్సై సురేష్, పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి, అధికారులు ఉన్నారు.

వేల్పూర్‌లో పర్యటించిన ఎన్ఎల్ఎం కమిటీ సభ్యులు



వేల్పూర్: వేల్పూర్ మండలం కుకునూర్, కోమన్‌పల్లి, అక్లూర్ గ్రామాలలో మంగళవారం నేషనల్ లెవల్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పర్యటించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు, ఉపాధిహామీ కూలీలు, పింఛను పొందుతున్న లబ్ధిదారులతో వారు మాట్లాడారు. ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్లను పరిశీలించారు. కేంద్రం నిధులతో చేపట్టిన పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎల్ఎం సభ్యులు సుధాకర్‌రెడ్డి, లోహిత్‌రెడ్డి, ఎంపీడీవో బాలకిషన్, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఈజీఎస్ అధికారులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

కళాశాలల్లో 31న స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌టౌన్/బాల్కొండ/బోధన్ : పలు కళాశాలల్లో మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాళ్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్‌లోని హౌసింగ్‌బోర్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల కళాశాల నందు, పట్టణంలోని పిప్రిరోడ్డులో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, వేల్పూర్ బాలుర నందు, మెండోరా మండలం పోచంపాడ్‌లోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కాలేజీలో, బోధన్ ఎస్సీ గురుకుల బాలుర జూనియర్ కాలేజీలో 2025–26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ రాగలత, సాయన్న, సుదర్శన్, గోదావరి, ఎస్. రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. విద్యార్థులు మెమో, కుల ధ్రువీకరణ, ఆదాయ సర్టిఫికెట్‌లు ఒరిజినల్ తీసుకుని రావాలన్నారు. అదే రోజు సాయంత్రం ఎంపికైన అభ్యర్థుల జాబితా ప్రదర్శిస్తామని పేర్కొన్నారు.

వంట మనిషి పోస్టుకు...

రుద్రూర్: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న వంటమనిషి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారిణి శ్యామల తెలిపారు. ఈ పోస్టుకు 18 నుంచి 40ఏళ్లలోపు వయస్సు కలిగి పదో తరగతి చదివిన మహిళ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఆగస్టు ఒకటో తేదీ వరకు పాఠశాలలో అందజేయాలని కోరారు.

బీడీ స్కాలర్‌షిప్‌కు..

బాల్కొండ: ప్రభుత్వ, ప్రయివేట్, ఎయిడెడ్ పాఠశాలలో చదువుతున్న బీడీ కార్మికుల పిల్లలు స్కాలర్ షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బాల్కొండ ఎంఈవో రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఆగస్టు నెల 31 వరకు ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. హెల్ప్ లైన్ నంబరు 0120–6619540 కు కాల్ చేసి అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు.

పని గంటల పెంపు జీవోను రద్దు చేయాలి

కమ్మర్‌పల్లి: పని గంటల పెంపు జీవో 282 ను తక్షణమే రద్దు చేయాలని టీయూసీఐ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా టీయూసీఐ నాయకులు మాట్లాడుతూ కార్మికులకు రూ. 26 వేల నెలసరి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సత్తెక్క, అశోక్, అంజనేయులు పాల్గొన్నారు.

జీపీ కార్యాలయం వద్ద ముదిరాజ్‌ల నిరసన

రుద్రూర్: పాత పోతంగల్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఏర్పాటు చేసుకున్న హద్దులను ఎలాంటి సమాచారం ఇవ్వకుండా జీపీ సిబ్బంది తొలగించారని ముదిరాజ్ సంఘ సభ్యులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోతంగల్ జీపీ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన వ్యక్తం చేసినంతరం వినతిపత్రం అందజేశారు.

రేపు బోధన్‌కు చంద్రశేఖర్ శివాచార్య మహాస్వామి రాక

బోధన్: ఈనెల 31న పట్టణానికి కాశీపీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర్ శివాచార్య మహాస్వామిజీ రానున్నారని వీరశైవ సమాజ్ ప్రతినిధులు తెలిపారు. 3న బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో శివాచార్య పర్యటన ఉంటుందన్నారు.